# పొద్దు గడవదు



విరామమనేది లేకుండా ముప్పయ్యేళ్ళు సర్వీసు చేసి, సాంసారిక బాధ్యతలన్నీ నెరవేర్చి, ఇల్లుకట్టి, పెళ్ళిచేసి, రిటైరయ్యారు సోమయ్యగారు. రిటైరు కావడంవల్ల ఆయనకొక తీవ్ర సమస్య వచ్చిపడింది. అదేమిటంటే, రోజల్లా కాలక్షేపం కాకపోవడం. ఆయన కొచ్చిన పెద్ద ఇబ్బందల్లా యిదొక్కటే. విరామం. డిటెక్టివ్ నవలలు తగినన్ని అచ్చుకావడంలేదు. చదివినవే చదవాలి. చదరంగం. పేకాట. ఆడినవాళ్ళతోనే ఆడాలి. అయినా పొద్దు గడవదు.

సోమయ్యగారిది దబ్బపండువంటి పచ్చటి ఛాయ. లావుగా పొడవుగా గంభీరంగా వుంటారు. పెద్దకళ్లు, సగం నెరసిన మీసాలు నున్నటి బట్టతల— యివన్నీ ఆయనకొక గాంభీర్యాన్నిచ్చాయి. వృద్ధాప్యంలో అడుగుపెట్టినా మధ్య వయస్కుడిలాగనే వుంటారు.

గడిచిన జీవితం సఫలమయిందనే తృప్తి ఆయన కళ్ళల్లో కనిపిస్తూ వుంటుంది. అది ఆయన ఎప్పుడూ మరపురానిది. సర్వీసులో వున్నప్పుడు తాననుభవించిన పదవు ప్రతిష్ఠ. హోదా. డబ్బు. పలుకుబడి మళ్ళీ తిరిగి రావనే విచారాన్ని కప్పిపుచ్చుకునేందుకు చేసే ప్రయత్నం జాగ్రత్తగా గమనిస్తేగాని కనబడదు.

ఉదయం లేచింది మొదలు ఆఫీసు. గుమస్తాలు ఇంద్రోతులు, ఊళ్లో పరిపాలనా బాధ్యతలు. సహాయం కోరివచ్చి పోయేవాళ్ళు. రాత్రి పది వరకూ క్షణం తీరిక ఉండేదికాదు. కాని ఇప్పుడో?

ఉదయం అయిదో గంటకు లేచి కాలకృత్యాలు తీర్చుకుని, స్నానం చేసి, భార్య బోధ పడలేక కొద్దిగా జపం చేసుకుని ఫలహారం తీసుకుని గర్రున తేన్చుకుంటూ వీధరుగుమీద ఈజీ ఛెయిర్‌లో కూర్చుని వార్తాపత్రిక చదవడం పూర్తయేసరికి ఎనిమిదో గంటవుతుంది. ఇళ్ళ గోడలమీద, కిటికీలమీద, పెంకులమీద తూర్పు దిక్కునుండి వచ్చి పడే లేత ఎండని కొంతసేపు పరిశీలనగా చూస్తారు. రోజూ చూస్తున్న ఎండే కాని, చూస్తారు. అయితే ఆ లేత ఎండవల్ల ఆయనలో భావోద్రేకంగాని కవితావేశంగాని కలుగవు. అంతలో ఒక గ్రామీణ యువతి వంకాయలమ్ముకుంటూ వస్తుంది.

"ఏమిటమ్మీ అవీ?" అంటారాయన.

"ముళ్ళొంకాయలు బాబూ. ఓ వీసె పడేయమంటారేటి?" అంటూ తట్ట అరుగుమీద దింపుతుంది.

"ఆ పోవిద్దూ అవేం ముదరకాయలో, పుచ్చుకాయలో?"

"ఏటి బాబుగారూ అలాగంటారు? నేత సింతలు బాబూ ఎన్నముద్దలు. జిలేబీలు. గులాబుజాములు. ఆ మాటకొస్తె వచ్చివే తినేయొచ్చు బాబూ. ఇప్పుడిప్పుడే తోటలో కోసుకొచ్చాను. సూడండి బాబూ."

"ఊ— సరుకెలావున్నా కబుర్లు మా బాగా చెబుతావే. సరేగాని, ఎలా యిస్తావేమిటి?"

"వీస పదణాలు బాబూ."

"అబ్బో పదణాలే. ఏమిటమ్మీ, యీరోజుల్లో మనుషులకే లేదు పదణాల విలువ, వంకాయలకా? రోజు రోజుకీ మరీ ఘోరమయిపోతూందమ్మీ."

"మా కష్టం సాలదు బాబూ, ఏం సెయ్యమంటారు?"

"సరే వెళ్ళు అక్కర్లేదు"

"పొద్దున్నె బోణీబేరం బాబూ. పోనీ అర్ధరూపాయికిస్తాను ఏసుకోండి"

"అక్కర్లేదమ్మీ. మా పెరట్లో వంగతోటుంది. నీపుణ్యమా అని రోజుకో అరవీసెడు కాయలు కాస్తుంది" అంటూ తృప్తిగా చిరునవ్వు నవ్వుతారు.




"సరేలేబాబూ" అంటూ తట్ట తలమీద పెట్టుకుని వెళ్ళిపోతుంది. మర్నాడు మళ్ళీ పిలిస్తే తట్ట అరుగుమీద దించకుండానే మాట్లాడుతుంది.

ఇంతలో ఎవడో గడిమోపుల వాడొస్తాడు.

"ఏమిటయ్యా అది" అంటారు సోమయ్యగారు (ఆయనకు కించిత్తయినా దృష్టిదోషంలేదు).

"ఎండుగడ్డి బాబూ. పెరట్లో ఓ మోపు పడేసుమంటారేటి?"

"కొండగడ్డిలా వుందే"

"ఛ ఛ. ఏటి బాబూ అలా అంటారు. వొరిగడ్డి బాబూ. ఓ మోపు పడేయమంటారా?"

"ఎంతకిస్తానంటావు?"

"మోపు రూపాయి బాబూ"

"ఒస్. నువ్వు మరీనురా. రూపాయేమిట్రా. ఎవరేనా నవ్విపోతారు."

"పోనీ ఎం తిస్తానంటారు?"

"నేనెంతా యివ్వను. అదికాదు నేనసేది. ధరలేలా మండిపోతున్నాయో చూస్తుంటాను. వంకాయలు వీశె పరణాలు. గడ్డిమోపు రూపాయి. మా కాలంలో పెదవ గడ్డిమోపు పావలా. తెలిసిందా? ఈ పెదవ రోజుల్లో గడ్డికి కూడా విలువ పెరిగిపోయిందిరా నాయనా. హరి హరీ కాలం మండిపోతూంది."

"పోనీ ఎంతిస్తారో చెప్పండి బాబూ. ఓ మోపు పడేస్తాను."

"నాకెందురా గడ్డి? మా కేం పశువులా ఏమైనానా? పోయినేడాది పూటకు రెండు సేర్లు పాలిచ్చే గంగిగోవులాంటి ఆవు చచ్చిపోయిందిరా. మళ్ళీ కొనలేదు."

గడ్డిమోపులవాడు మరొక క్షణం కూడా కాలయాపన చెయ్యకుండా వెళ్ళిపోతాడు.

ఇంతలో కాలేజీ కెళ్ళే ఎదిరింటి డాక్టరుగారమ్మాయీ, ఆఫీసుకు వెళ్ళే వీధి చివరి గుమాస్తా. రోజూ ఎర్రంచు తెల్లచీర కట్టుకుని బడికి వెళ్ళే పంతులమ్మా. కూలి పనికి పోయే రైలు కళాసీ. ఆయవారానికి బయలు దేరిన నామాల బ్రాహ్మడూ కనిపిస్తారు. వాళ్ళందరినీ నిలబెట్టి పలకరించి, ప్రశ్నలు వేసి, కుర్చీలోంచి లేచే పరికి పదకొండవుతుంది. భోజనానికి వేళవుతుంది. భోజనం చేసి, నిద్ర పోయిన తరవాత డిటెక్టివ్ నవల చదివి. సాయంత్రం క్లబ్బుకు పోయి వస్తారు. రోజు గడచిపోతుంది.

• • •

ఇక్కడికి సరిగ్గా మూడుమైళ్ళ దూరంలో ఒక కుగ్రామంలో ఒక మూల ఒక పూరిగుడిసెలో గవరమ్మకు క్షణం తీరిక లేకుండా పగలల్లా కష్టపడినా రోజులు గడవడం లేదు. భర్త లేడు. తండ్రిలేడు. అన్నదమ్ములు లేరు. పదేళ్ళ కొడుకున్నాడు. తనుంది. తనూ తన కొడుకూ రోజల్లా పొలంలో కూలిపని చేసుకుంటారు. లేనప్పుడు పేడతో పిడకలు పెట్టి అమ్ముకుంటారు. పెట్టుబడి లేని వ్యాపారం. అందుకే రోజుల తరబడి పిడకలు పెట్టి ఎండబెట్టి అమ్మితే తట్టకు రెండు రూపాయలేనా రావు. కష్టేఫలే అన్న సూత్రానికి కాలదోషం పట్టింది. పెట్టుబడితోనే ఫలితం అన్నదే యీ నాటి సూత్రం.

ఇల్లూ వాకిలీ లేకపోయినా, నా అన్నవాళ్ళు లేకపోయినా ఒక పూట తిని ఒకపూట లేకపోయినా ఒంట్లో శక్తి సన్నగిల్లి, వయసుకు మించిన వృద్ధాప్యం వచ్చి బతుకంతా ఎండిన పిడకలాగయిపోయినా గవరమ్మకు బతుకుమీద ఆశ పోలేదు, కొడుకును చూసుకొని కలలు కంటుంది. వాడు పెద్దయితే, దబ్బు గడిస్తే తను సుఖపడవచ్చుననుకుంటుంది. ఉన్నకాస్తలో వాడికి ముందు పెట్టి తరవాతే తను తింటుంది. పంచప్రాణాలు వాడిమీదే పెట్టుకు బతుకుతూంది.

అయితే వాడికి ఉన్నట్టుండి హఠాత్తుగా జ్వరం వచ్చింది. వచ్చిన జ్వరం తీవ్రమైంది. నాటు వైద్యమెంత చేసినా లొంగింది కాదు. రాత్రి తెల్లవార్లూ ఒంటిమీద స్పృహలేదు. గవరమ్మకు కంటిమీద కునుకులేదు. ఈ బిడ్డ బతుకుతాడా? ఎవర్ని చూసుకు తాను బతుకుతుందో వాడు బతుకుతాడా? గవరమ్మకు బెంగ పట్టుకుంది. అమ్మవారికి మొక్కుకుంది. కన్నీళ్ళతో చీర తడుపుకుంది.


పట్నంలో ఫలానా వీధిలో ఫలానా డాక్టరున్నాడు. వయసు మళ్ళినవాడు. ఎర్రగా లావుగా పొడవుగా వుంటాడు. నెరసిన మీసాలు. బట్టతల. చప్పున పోల్చుకోవచ్చు. చాల మంచివాడు. పేదలంటే దయ. డబ్బు యిస్తే పుచ్చుకుంటాడు, లేకపోతే లేదు. పిలవగానే మోటారు సైకిలేసుకుని వస్తాడు? వెళ్ళి పిలుచుకు రమ్మని ఊళ్ళో అంతా గవరమ్మకి సలహా యిచ్చారు.

క్టరుగారి కుక్క అది. ఆయన కోపోద్రిక్తుడై పోలీసుల్ని తీసుకొచ్చి విద్యార్థిని అరెస్టు చేయిస్తాడు. విద్యార్థిని అరెస్టు చేసినందుకు కాలేజీ విద్యార్థులంతా సమ్మె చేసి నిరసన ప్రదర్శనం జరుపుతారు. పోలీసు స్టేషనుమీద రాళ్ళు రువ్వడం. పోలీసుల లాఠీచార్జీ. బాష్పవాయు ప్రయోగం. కాల్పులు. రంగంలోకి రాజకీయనాయకుల ప్రవేశం.— అప్పుడు పేపర్లో బేనర్ హెడ్ లైన్ - కావలసినన్ని వార్తలు. కాని కుక్కపారి పోయింది. విద్యార్థి తన దారిన తాను పోయాడు.

గవరమ్మ ఆందోళనగా యిళ్ళవేపు చూస్తూ రోడ్డుమీద కనిపించింది.

"ఏవమ్మీ. ఏవూరు నీది?" అని పలకరించారు సోమయ్యగారు.

"డాక్టరుగారి యిల్లు యిదేనాబాబూ. మాపిల్లోడికి చాలజ్వరంగా వుందిబాబూ. ఒక్కమాటొచ్చి




సూడండి బాబునా. మీపున్నెముంటాది. ఒంటిమీద తెలివిలేకుండా పడున్నాడు బాబూ" అంది గవరమ్మ.

"అయ్యోపాపం. జ్వరమా? ఏవూరు మీది?"

"దగ్గరే బాబూ అయ్యన్నపాలెం. మీచేత్తో యింత మందు పోస్తేనేగాని బతకడు బాబూ"

"ఏవీటి నీకొడుక్కి జ్వరమా? నీకెంతమంది కొడుకులు? నీ మొగుణ్ణి పంపలేకపోయావ్. నువ్వే పరిగెత్తుకుంటూ వచ్చావు. పిల్లవాడిదగ్గర ఎవరైనా వున్నారా?"

"నాకెవరూ లేరుబాబూ - దిక్కుమాలినదాన్ని నేనూ. నాకొడుకూ. పొరిగింటి వోళ్ళకాడ అట్టుంచి వొచ్చాను బాబూ. నిన్న మధ్యాన్నం జ్వరం తగిలింది. రాత్రంతా ఒంటిమీద తెలివి లేదు బాబూ. మూలుగుతూనే వున్నాడు. ఏటో బాబూ అంతా నాకరవు."

"అదే నమ్మీ ఈ రోజుల్లో ఈ మాయదారి జ్వరాలు హఠాత్తుగా వస్తున్నాయి. మొన్న మా పొరుగున్న పాలమ్మి కొడుక్కి ఉన్నట్టుండి హఠాత్తుగా జ్వరం తగిలింది. బాగా ఎక్కువైంది. డాక్టరుకూడా అదేం జ్వరమో పోల్చుకోలేకపోయాడు. ఆస్పత్రికి తీసుకుపోయారు. కుర్రాడు బతికేడనుకో.

"హమ్మయ్య. ఆ తల్లి చేసుకున్న పున్నెం బాబూ. మీరొక్కసారి దయ్యసెయ్యండి బాబూ"

"పాపం నీకొక్కడే సంతానమన్నావుగదూ"

"అవును బాబూ. ఉన్న ఒక్కకొడుకుని బతికించుకోకపోతే నాను బతికుండి ఏటి నాభం బాబూ. తమరొక్కసారి చూసి మందియ్యండి బాబూ. కూలీనాలీ చేసి అయిదో పదో కూడేసి మీకిచ్చుకుంటాను బాయనా. ఆలస్యమయితే ఏం కొంప మునుగుతుందో అని బయంగావుంది బాబూ."

'పోనీ ఆయుర్వేద వైద్యం చేయించలేకపోయావ్. ఇంగ్లీషు వైద్యం వెంటనే గుణమిస్తుందికానీ శరీరాన్ని పాడుచేస్తుంది. మావాడొకడు ఇలాగే ఇంగ్లీషుమందులు వాడి శరీరం పాడుచేసుకున్నాడు. చివరికి సిద్ధమకరధ్వజంతో వాడి ఒళ్ళు బాగుపడింది."

"అదేం వొయిద్యమో నాకు తెలీదు బాబూ. ఒక్కసారిరండి బాయనా మీ కాళ్ళొట్టుకుంటాను. బాబ్బాబు. ఆలిస్యం సెయ్యకండి బాయనా. దయ దలచండి బాబూ మీ పున్నెముంటాది" అంటూ గవరమ్మ సోమయ్యగారి కాళ్ళుపట్టుకోబోయింది.

"అరెరె, అదేమిటది? మంచి గొడవే వొచ్చిందమ్మీ. ఇంతకీ నేసం డాక్టర్ని కానే. నే నొచ్చి చేసేదేముంది? ఆ ఎదురుగా వున్న యింట్లో ఒక డాక్టరున్నాడు. తీసుకెళ్ళు."

"అయ్యో కొంపతీసేరు బాబూ, మీరు డాక్టరుబాబు కారా. సెప్పేరుకారేం. ఆ యింట్లో ఉన్నారా బాబూ?" అంటూ ఆయింటి వేపు తిరిగింది.

"ఆ ఉన్నాడు. కాని లేడు ఇప్పుడిప్పుడే మోటారు సైకిలు మీద ఎటో వెళ్ళిపోయాడు. చూడలేదు.

"వెళ్ళిపోయాడా? కొంపమునిగింది బాయనా. నాకేం దారి బాబూ" అంటూ గవరమ్మ నెత్తి నోరుకొట్టుకుని ఏడుస్తూ ఇంటికి తిరిగిపోయింది.

ఇంటికెళ్ళే సరికి పిల్లవాడికి వైద్యమే అవసరం లేకపోయింది. అసలు ప్రాణం వుంటేగా. ●

• • •

సోమయ్యగారు యధావిధిగా యిడ్లీ కాఫీ తీసుకుని. వీధరుగుమీద ఈజీ చైర్లో కూర్చుని వార్తాపత్రిక చదవడం పూర్తి చేశారు. ఆరోజు చెప్పుకోదగ్గ వార్తలేవీ లేవు. సమ్మెలు. సభలు హర్తాళ్ళు అల్లర్లు. కాల్పులు ఏవీలేవు? మనిషి చంద్రలోకానికి వెళ్ళలేదు. ఏ దేశం మీద అటంబాంబు పడలేదు. సరిహద్దు సంఘర్షణేదీ జరగలేదు. ప్రపంచమంతా రిటైర్డ్ లైఫ్‌లా వుంది.

సోమయ్యగారు రోడ్డుమీద పోతున్న కాలేజీ విద్యార్థిని పరిశీలనగా చూస్తున్నారు. విద్యార్థి రోడ్డుమీద నిలుచున్న కుక్కను చూస్తున్నాడు. కుక్క దూరంగా వున్న యింకో కుక్కను చూస్తోంది. విద్యార్థి ఆ కుక్క మీద రాయి విసురుతాడు. కుక్క వాడిని కరుస్తుంది. వాడు కోపంకొద్దీ మరొక రాయి తీసి కుక్కని గట్టిగా కొడతాడు. దానికి దెబ్బ తగులుతుంది. దాని అరుపులకి జనం మూగుతారు. రిటైర్డ్ డిప్టీకలె